సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
శుక్రవారం 22-11-2024
సంపుటి: 20 సంచిక: 203
పేజీలు: 4 వెల: రూ.1

కాలచక్రం గిర్రున తిరిగింది.. 26 ఏళ్ల వయసులో అనుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఒక యువకుడి కన్నీళ్ల తడి ఆరేసరికి ఏకంగా కష్టాల మబ్బులు దాటి వర్షపు చినుక్కు సైతం తడవనంత ఎత్తుకు ఎదిగిపోయాడు. చాలామందిలాగే రాజకీయ వారసుడిగానే ఆరంగేట్రం చేసినా తన మార్కును, తన తండ్రి శైలిని విడవకుండా అందనంత ఎత్తుకు ఎదిగాడు. నెపోటిజం అనుకోడానికి సులువే అయినా ఆ లెగసీని కొనసాగించడానికి వారసులు పడే ఒత్తిడి చెప్పుకోలేనిది. ఎప్పటి ఒత్తిడిని అప్పుడే చిత్తుచేస్తూ చిరునవ్వుతో కనిపించే కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు రాజకీయాల్లోకి అడుగు పెట్టి నవంబరు 23కు సరిగ్గా 12 ఏళ్లు అవుతుంది.



# పుష్కర కాలం.. పుష్పక విమానం





- వారసుడుగా వచ్చినా సారధిగా ఎదిగారు
- నాడు ఢిల్లీలో ఆంధ్రా అంటే ఎర్రన్నే
- నేడు దక్షిణాదంటే రామూనే
- కేంద్రమంత్రి అయినా ఎంపీగానే చొరబాటు
- రాజకీయ ఆరంగేట్రం చేసి నేటికి 12 ఏళ్లు






**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

2012 నవంబరు 2న కింజరాపు ఎర్రన్నాయుడు మరణించడంతో సిక్కోలు ప్రజాసదన్‌కు వచ్చిన రామ్మోహన్‌నాయుడు తండ్రి కర్మకాండల అనంతరం నవంబరు 23న ప్రజాసదన్‌లో ఎర్రన్నాయుడు కూర్చునే కుర్చీని అధిష్టించారు. జిల్లాలో మరో నాయకుడికి గాని, రాష్ట్రంలో మరో ఎంపీకి గాని మాట వరుసకైనా చెప్పకుండా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రామ్మోహన్‌నాయుడును శ్రీకాకుళం టీడీపీ ఎంపీ అభ్యర్ధిగా అప్పుడే ప్రకటించారు. అందుకు కారణం.. జిల్లాలో ఎంపీగా టీడీపీకి మరో అభ్యర్థి దొరకరనీ కాదు, ఎర్రన్నాయుడు కొడుకనీ కాదు. ఎందుకంటే.. అప్పటికి ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయముంది. ఈలోగా తండ్రి చనిపోయిన సానుభూతి ఉంటుందో, లేదో తెలీదు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఎర్రన్నాయుడు కూడా పదవి లేకుండా ఉన్నారు. కాబట్టి ఎన్నికల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. సరిగ్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రామ్మోహన్ నాయుడు జిల్లాలో అన్ని నియోజకవర్గాలూ పర్యటించారు. తన తండ్రి ఆత్మబంధువులను ఓదార్చారు. టీడీపీ నాయకులకు తానున్నానని భరోసా ఇచ్చారు. అక్కడితో ఆగకుండా తాను ఎంపీ అభ్యర్థినని ఓటర్లను పరిచయం చేసుకోడానికి తన పార్లమెంట్ పరిధిలో సైకిల్ యాత్ర చేశారు. దాని ఫలితమే 2014లో 1,27,572 ఓట్ల మెజార్టీతో గెలిచారు. తన పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలిచిన టీడీపీ అభ్యర్థులందరి మెజార్టీ కలిపితే 80వేల పైచిలుకు కాగా, ఒక్క రామ్మోహన్‌నాయుడు మెజార్టీయే 1,27,572. పాతపట్నంలో అప్పుడు వైకాపా గెలిచినా, రాముకే ఇక్కడ ఓట్లు ఎక్కువ పడ్డాయి. జనంలో ఉన్న ఆదరణ చూసి వెంటనే టీడీపీలో జాతీయ స్థాయి పదవిని చంద్రబాబు రామ్మోహన్‌కు అప్పగించారు. 2014లో పార్లమెంట్‌లో అడుగు పెట్టింది మొదలు, ఇప్పుడు కేంద్రమంత్రి అయ్యేవరకు ఆయన వాగ్ధాటికి, సబ్జెక్టు మీద అవగాహనకు ప్రధాని మోడీతో సహా మురిసిపోని నేతలు లేరు. 2019 ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో కేవలం 2 స్థానాల్లో మాత్రమే టీడీపీ గెలిచింది. అది కూడా బొటాబొటీ మెజార్టీతోనే. కానీ 46.19 శాతం ఓటు షేర్‌తో రాము 6658 ఓట్ల మెజార్టీతో రెండోసారి గెలుపొందారు. ఆ తర్వాత తన తండ్రిలాగే పార్లమెంట్‌లో టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా బాధ్యతలు చేపట్టి వైకాపా తరఫున 25 మంది ఎంపీలున్నా రాముని ఎదుర్కోలేకపోయారు. 2024 ఎన్నికలకు వచ్చేసరికి శ్రీకాకుళంలో ఎంపీ సత్తా ఏమిటో అప్పటి సిట్టింగ్ ప్రభుత్వానికి అర్థమైపోయింది. శ్రీకాకుళంలో ఒక్క రామును అడ్డుకుంటే ఖాతా కూడా తెరవదని, ఆయన్ను నిలువరించడానికే వైకాపా శ్రేణులంతా తమ శక్తిని దారపోయాలని బహిరంగంగానే ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. సీన్ కట్ చేస్తే 61.05 స్ట్రైకింగ్ రేట్‌తో 3,27,901 రికార్డు మెజార్టీతో రాము చరిత్రను తిరగరాశారు. విచిత్రమేమిటంటే.. ఈ ఎన్నికల్లో వైకాపా ఏ అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ ఖాతా తెరవలేదు. ఇటు చంద్రబాబునాయుడుకు, అటు ప్రధాని మోడీకి తురుపుముక్కలా ఉపయోగపడతాడనే భావనతోనే ఎలైట్ పోర్ట్‌ఫోలియో అయిన పౌర విమానయాన శాఖను అప్పగించారు. 2019-20లో 84 శాతం పార్లమెంట్ అటెండెన్స్‌తో 69 ప్రశ్నలు రాష్ట్రం కోసం, 49 ప్రశ్నలు దేశం కోసం వేశారు. రైల్వే స్టాండింగ్ కమిటీ, హోం ఎఫైర్స్ కమిటీ సభ్యుడిగా టూరిజం అండ్ కల్చరల్ కమిటీలోను, బీసీ కమిటీలోను, అఫీషియల్ లాంగ్వేజ్ మెంబర్‌గాను ఆయన మొదటిసారి ఎన్నికైనప్పుడే పని చేశారు. రామ్మోహన్‌నాయుడు తండ్రి ఎర్రన్నాయుడు కేంద్రమంత్రి అయినప్పుడు

- మిగతా 4లో

# అమ్మాయిల వేధింపుల్లోనూ..
# కార్పొరేట్‌దే ఫస్ట్‌ర్యాంక్





- విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయి అధ్యాపకులు
- కాలేజీ ప్రతిష్ఠ పేరుతో దాటేస్తున్న మేనేజ్‌మెంట్
- స్టేషన్లు, కోర్టులు తిరగలేక తగ్గుతున్న పేరెంట్స్
- కొద్ది రోజుల క్రితం కీచక గురువుకు దేహశుద్ధి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

మన దేశంలో ఎప్పటికీ వన్నె తరగని వ్యాపారాలు రెండు. ఒకటి విద్య, రెండు వైద్యం. ఈ రెండు రంగాల్లోనే కార్పొరేట్లు బలంగా నాటుకుపోయి ఉంటారు. అందుకు కారణం.. పెట్టుబడికి పదింతలు పైగా లాభాలు రావడం. అయితే ఆమేరకు సేవలందించడానికి అవసరమైన నిపుణులు మన దగ్గర ఎక్కడున్నారు? అందుకే అప్పుడే పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి హుషారుగా బయోడేటాను పట్టుకొచ్చిన ప్రతిఒక్కడికి కార్పొరేట్ కళాశాలల్లో అధ్యాపకుడిగా ఉద్యోగమిస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువుకు ఉండాల్సిన లక్షణాలు ఉన్నాయో లేవో చూడకుండా కేవలం తమ కరిక్యులం విద్యార్థుల బుర్రలోకి ఎక్కించేవాడైతే చాలన్న కోణంలో డిగ్రీ విద్యార్థి కంటే రెండేళ్లు సీనియరైనవాడికి అధ్యాపకుడి పోస్టులు కట్టబెడుతున్నారు. మార్కెటింగ్ చేస్తారనో, తమవద్దే యూనిఫామ్, పుస్తకాలు, నోట్‌బుక్స్ కొనుగోలు చేసేలా భయపెడతారనో అధ్యాపకులను కార్పొరేట్ నిర్వాహకులు ముద్దుబిడ్డల్లా చూస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకొని వయసొచ్చిన అమ్మాయిలతో ఈ కుర్ర అధ్యాపకులు ఇష్టారీతిగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడు ముందు చెప్పుకున్నట్టు ఉదాహరణలు చూద్దాం.

నగరంలోని ఒక కార్పొరేట్ సంస్థ విద్యార్థినుల ప్రాంగణంలో మాథ్స్ అధ్యాపకుడు ముగ్గురు విద్యార్థుల పట్ల స్టడీ అవర్‌లో అసభ్యకరంగా కీచకబుద్ధి చూపించాడు. ఎవరికైనా ఫిర్యాదుచేస్తే ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తానని హెచ్చరించి వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధిత విద్యార్థినులు ఒక మహిళా అధ్యాపకురాలి ద్వారా ప్రిన్సిపాల్‌ను ఆశ్రయించి సదరు మాథ్స్ అధ్యాపకుడు వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేశారు. సదరు ప్రిన్సిపాల్ ఈ వ్యవహారం బయటకు రానీయకుండా విద్యార్థినిలకు నచ్చజెప్పి మాథ్స్ అధ్యాపకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించి విడిచిపెట్టేశారు. అయితే దీనికి ప్రతిగా కళాశాల ప్రిన్సిపాల్‌పై మరో విద్యార్థినితో మాథ్స్ ఉపాధ్యాయుడు యాజమాన్యానికి ఫిర్యాదు చేయించాడు. దీంతో యాజమాన్యం ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించింది. ఆ స్థానంలో గతంలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మాథ్స్ అధ్యాపకుడే ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టాడు.

స్థానికంగా ఉన్న మరో కార్పొరేట్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ అయిన యువకుడు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు ఒకడుగు ముందుకేసి ప్రేమిస్తున్నానని, అందంగా ఉంటావని.. ఇలా వాట్సాప్ సందేశాలు కూడా పంపడంతో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. ఆయన్ను ఈ కళాశాల వదిలించుకుంది. ముందే చెప్పుకున్నట్టు మార్కెటింగ్‌కు పనికొచ్చే అధ్యాపకుల కొరత ఉండటంతో ఈ కీచకుడ్ని తీసుకువచ్చి సమీపంలో ఉన్న మరో కార్పొరేట్ సంస్థ ఉద్యోగమిచ్చింది. అక్కడ కూడా అదే పనిగా విద్యార్థినుల వెంటపడటంతో కొన్నాళ్ల క్రితం అమ్మాయి కుటుంబ సభ్యులు వచ్చి క్లాస్‌రూమ్‌లోనే ఈ అధ్యాపకుడ్ని పిచ్చ కొట్టుడు కొట్టారు. ఈ కథ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లినా సుఖాంతం కావడంతో కేసు లేకుండా బయటపడ్డాడు. విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా బుద్ధి చెప్పి పంపించేయాలని, కోర్టుల చుట్టూ తిరగలేమని చెప్పడం వల్ల ఇటువంటివారంతా కాలేజీలు మారి పబ్బం గడిపేసుకుంటున్నారు. ఆమధ్య ఓ కార్పొరేట్ డిగ్రీ కాలేజీలో కూడా పెళ్లాం వదిలేసిన ఓ కీచక అధ్యాపకుడు విద్యార్థినుల పట్ల ఇలాగే మొరటుగా వ్యవహరించడంతో కథ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. అయితే విచారణ చేస్తున్నామని, అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు దీన్ని తాత్సారం చేయడంతో ఈ వ్యవహారం నీరుగారిపోయింది. ఈలోగా కళాశాల యాజమాన్యం అధ్యాపకుడ్ని విధుల నుంచి తప్పించింది. ఇతగాడు గతంలో పని చేసిన రెండుచోట్ల విద్యార్థినుల పట్ల ఇలాగే వ్యవహరించడంతో గతంలో కూడా రెండుచోట్ల దరువులు పడ్డాయని భోగట్టా.

**ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తామని..**

ఓవరాల్ స్కోరింగ్‌లో ప్రాక్టికల్ మార్కులు ముఖ్యం. ఇవి అధ్యాపకుల చేతిలోనే ఉంటాయని యాజమాన్యాలు ముందే భయపెడతాయి. ఎందుకంటే.. సంబంధిత ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకుల చేతిలో విద్యార్థులు ఉండాలని, వారి ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలనేది వారి వ్యాపారం. దీన్ని అలుసుగా చేసుకొని ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తామని భయపెట్టే యువ అధ్యాపకులు దాదాపు అన్ని కార్పొరేట్ కళాశాలల్లోనూ ఎంతోకొంతమంది ఉన్నారు. వాస్తవానికి ప్రాక్టికల్స్ చేయించడానికి వేరే కాలేజీల నుంచి అధ్యాపకులు వస్తారు. వారికి విద్యార్థుల నుంచి వసూలుచేసిన అనధికారిక రుసుమును చెల్లించి ఏ విద్యార్థికి ఎన్ని మార్కులు వేయాలో అక్కడున్న ప్రిన్సిపాలే నిర్ణయిస్తాడు. కాకపోతే ఇక్కడున్న కార్పొరేట్ కళాశాలల్లోని ప్రిన్సిపాళ్లందరూ ఇంకా ప్రేమ, పరాయి స్త్రీ పేరు చెబితే ముసిముసిగా ముడుచుకుపోయేవారే. అటువంటిచోట విద్యార్థినులు బయటకు చెప్పలేక, లోపల దాచుకోలేక సతమతమవుతున్నారు.

‘ప్రభుత్వం’ అనే బోర్డు లేకుండా చదువు చెపుతామని ఎవరు ఓ ప్రకటన ఇచ్చినా అది కార్పొరేట్ సంస్థ కిందే విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తారు. ప్రభుత్వ కాలేజీలో చదివితే ర్యాంకులు రావనేది వారి మెదడు పొరల్లో నాటుకుపోయిన నమ్మకం. భార్యాభర్తల సంపాదన ఏం చేసుకోవాలో తెలీక కార్పోరేట్లకు సొమ్ములు పొయ్యడాన్ని వారి స్వవిషయంగా భావించినా తప్పలేదు. కానీ తమ పిల్లల, మరీ ముఖ్యంగా ఆడపిల్లల మనోవేదనకు, మానసిక ఘర్షణకు గురి చేస్తున్న కార్పోరేట్ అధ్యాపకుల తీరే ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఇంతవరకు ర్యాంకుల కోసం, మార్కుల కోసం కార్పోరేట్ విద్యాసంస్థలు పెట్టే ఒత్తిడి భరించలేకే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విన్నాం, చదివాం. కానీ ఎలాంటి ఒత్తిడినైనా భరించగలిగి ర్యాంకుల రేసులో మొదటి వరుసలో ఉన్న అమ్మాయిలు సైతం కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారంటే అందుకు కారణం చదువుల ఒత్తిడి కాదు. అంతకు మించి కొన్ని కార్పోరేట్ కళాశాలల్లో ఏదో జరుగుతోంది. ఆ ‘ఏదో’ తల్లిదండ్రులకు సైతం చెప్పకోలేనిదై ఉంటుంది. బయటకు చెబితే చదువు మాన్పించేస్తారని, కొద్ది రోజులు భరిస్తే గండం దాటిపోతామని భావిస్తున్న విరిసీ విరియని అమ్మాయిలు చివరకు ఎవరికీ చెప్పకోలేక జీవితాన్ని అర్థాంతరంగా ముగిస్తున్నారు. దీన్ని ఒక్క ముక్కలో ఒత్తిడి తట్టుకోలేక తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చలేమనే భావనతో తనువు చాలిస్తున్నారని కేసును క్లోజ్ చేస్తున్నారు. కానీ కార్పోరేట్ కళాశాలల్లో జరుగుతున్నది వేరు. అక్కడేం జరుగుతుందో చెప్పడానికి సింపుల్‌గా రెండు ఉదాహరణలిస్తాం. ఇందులో ఏ ప్రాణం ఎందుకు పోయిందో ఆలోచించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.


● ఎడిటోరియల్

# ఎదగనివ్వని కులవివక్ష

భారత్‌లో చిన్నారుల ఎదుగుదల కులాన్ని బట్టి మారుతోంది. ఆధిపత్య కులాల్లో పిల్లల ఎదుగుదల లోపం అణగారిన వర్గాలవారితో పోలిస్తే తక్కువగా ఉంది. ఆదివాసీ, దళిత పిల్లల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తున్నది. భారత్, సబ్-సహారా ఆఫ్రికాలోని దేశాలకు చెందిన పలు సర్వేల ఆధారంగా తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. దేశంలో ఐదేళ్ల లోపు చిన్నారుల్లో 35 శాతం మంది ఎదుగుదల సమస్యతో బాధపడుతున్నారని వివరించింది. ప్రపంచంలోని ఇతర దేశాలే కాదు.. సబ్-సహారా ఆఫ్రికాలోని దేశాల కంటే కూడా ఈ లోపాన్ని ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య భారత్‌లోనే అధికంగా ఉన్నదని తెలిపింది. పలు జాతీయ, అంతర్జాతీయ నివేదికలు సైతం ఇదే విషయాన్ని తెలుపుతున్నాయి. సబ్-సహారా ఆఫ్రికా కంటే అధిక స్థాయిలో భారత్‌లోని పిల్లల ఎదుగుదల లోపానికి దశాబ్దాలుగా వస్తున్న కుల వివక్ష కూడా కారణమని తాజా అధ్యయనం ఒకటి వెల్లడిస్తున్నది. అశోక యూనివర్సిటీకి చెందిన అశ్విని దేశ్‌పాండే, మలేషియాలోని మోనాశ్ యూనివర్సిటీకి చెందిన రాజేశ్ రామచంద్రన్‌లు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ప్రపంచంలో ఈ రెండు ప్రాంతాల్లో కలిపి ఐదేళ్ల లోపు చిన్నారులు 44 శాతం మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70 శాతం మంది ఈ రెండు ప్రాంతాల నుంచే ఉండటం గమనార్హం. ఇది పోషకాహార లోపానికి ఒక సూచికగా విశ్లేషకులు చెప్తున్నారు. అయితే ఇందులో భారత రేటు 35.7 శాతంగా ఉంది. 49 దేశాలను కలిగిన సబ్-సహారా 33.6 శాతంతో భారత్ కంటే తక్కువగానే ఉంది. సబ్-సహారా ఆఫ్రికాతో పోలిస్తే భారత చిన్నారులు ఎత్తు తక్కువ ఉన్నారన్న హైట్ గ్యాప్ మీదనే దృష్టిని సారిస్తూ.. పిల్లల పోషకాహార లోపంలో సామాజిక గుర్తింపు పాత్రను, ముఖ్యంగా కులాన్ని విస్మరిస్తున్నారని అధ్యయనం తెలిపింది. చిన్నారుల జీవితంలో 'గోల్డెన్ పీరియడ్'గా పిలవబడే తొలి వెయ్యి రోజులు చాలా కీలకం. రెండేళ్ల వయసు వచ్చేనాటికి 80 శాతం మెదడు ఎదుగుతుంది. ఇది సుదీర్ఘ జీవితానికి కావాల్సిన ఒక పునాది. ఈ కీలకమైన సమయంలో చిన్నారులకు ఆరోగ్య సంరక్షణ మంచి పోషకాహారం, ప్రారంభ అభ్యాసం, సురక్షితమైన వాతావరణం వంటివి చాలా ముఖ్యం. ఇవి చిన్నారుల భవిష్యత్తును నిర్ణయిస్తాయని నిపుణులు చెప్తున్నారు. అయితే, గోల్డెన్ పీరియడ్‌లో చిన్నారులకు ఇవేమీ అందకపోవటంతో వారి ఎదుగుదలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని అంటున్నారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2021లో సబ్-సహారా, దక్షిణాసియా (భారత్‌తో కలుపుకొని)లు ప్రపంచ పేదరికంలో 85 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇది పేదరిక, అభివృద్ధిలో సవాళ్లను తెలియజేస్తున్నది. ఇది కూడా చిన్నారులపై ప్రభావం చూపిందని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక ఎదుగుదల సమస్య రేట్లు యుద్ధంతో దెబ్బతిన్న సబ్-సహారా ఆఫ్రియాలోని డి.ఆర్ కాంగో వంటి దేశాల్లో ఉన్నాయి. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారుల్లో మూడోవంతు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉన్న ఆదివాసీలు, దళితుల్లో పరిస్థితులు మరింత క్లిష్టంగా ఉంటాయని నిపుణులు చెప్తున్నారు. భారత్‌లో అణగారిన కులాలతో పోలిస్తే.. ఆధిపత్య కులాల పిల్లల్లో ఎదుగుదల లోపం 20 శాతం తక్కువ అని పరిశోధకులు చెప్పారు. జనన క్రమం, పారిశుధ్య పద్ధతులు, తల్లి ఎత్తు, తోబుట్టువుల సంఖ్య, విద్య, రక్తహీనత, కుటుంబ సామాజిక ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను ఇందులో పరిగణలోకి తీసుకున్నారు. దేశంలో సామాజిక అసమానతపై చర్చ జరగాలి. భారత్‌లో పిల్లల ఎదుగుదల లోపంపై కొన్నేళ్లుగా అనేక చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఇవి జన్యుపరమైనవిగా చూపితే, మరికొందరు పోషకాహార లోపంగా ఎత్తిచూపుతున్నారు. ఇంకొందరు ప్రభుత్వాల వైఫల్యాన్ని కారణంగా చెప్తున్నారు. దేశంలో బాలురతో పోలిస్తే బాలికల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని కొన్ని అధ్యయనాలు చెప్తున్నాయి. ఆదివాసీలు వంటి అణగారిన సామాజిక వర్గాల్లోని చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. భారత్‌లో ప్రత్యేకించి పేద కుటుంబాలు, తక్కువ చదువు కలిగి ఉన్న తల్లులు, అణగారిన సామాజికవర్గాలకు చెందిన పిల్లలు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారన్నది సుస్పష్టమని నిపుణులు చెప్తున్నారు. చిన్నారుల్లో ఈ ఎదుగుదల అంతరం విషయానికి వస్తే.. కుల ఆధారిత సామాజిక అసమానత కారణమవుతున్నదనీ, దాని విషయంలో సమాజంలో చర్చ జరగకపోవటం శోచనీయం.

# పీఏసీ చైర్మన్‌గా పులిపర్తి

**- పోటీ నుంచి తప్పుకున్న పెద్దిరెడ్డి - సంప్రదాయనికి విరుద్ధమని వైకాపా ఆరోపణ**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఏసీ చైర్మన్‌గా జనసేన భీమవరం ఎమ్మెల్యే పులిపర్తి రామాంజనేయులు ఎన్నిక లాంఛనమైంది. పీఏసీ (ప్రజా పద్దుల కమిటీ) చైర్మన్ ఎన్నికను వైసీపీ బహిష్కరిస్తున్నట్టు మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ శుక్రవారం ప్రకటించారు. గురువారం నామినేషన్ దాఖలు చేసిన వైకాపా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే బి. శివ ప్రసాద్ రెడ్డి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపత్రి చంద్రశేఖర్ బలపరుస్తూ నామినేషన్లు దాఖలు చేశారు. పీఏసీలో సభ్యత్వానికి అసెంబ్లీలో కనీసం 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలి కానీ వైకాపా బలం కేవలం 11 మాత్రమే. అయినా వైకాపా నామినేషన్లు దాఖలు చేసింది. పీఏసీలో 12మంది సభ్యులకు అవకాశం ఉంది. దీనిలో 9 మంది ఎమ్మెల్యేలు, ముగ్గరు ఎమ్మెల్సీలకు అవకాశం ఉంటుంది. ఎమ్మెల్సీల తరుపున కేవలం మూడు నామినేషన్లు రావడంతో ఆ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 9 సభ్యుల కోసం 10 నామినేషన్లు రావడంతో ఎన్నిక అనివార్యం అవుతుందని అందరూ భావించారు. దీనిలో కూటమి తరుపున 9 నామినేషన్లు, వైకాపా తరుపున ఒక్క నామినేషన్ దాఖలు అయింది. దీంతో శుక్రవారం ఎన్నికల జరగాల్సి ఉండగా వైకాపా నుంచి నామినేషన్ వేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. దీంతో పీఏసీ ఏకగ్రీవం అయింది. నామినేషన్ సమయంలో అసెంబ్లీలో పెద్ద హైడ్రామా నడిచింది. పెద్దిరెడ్డి నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చే సమయానికి అసెంబ్లీ కార్యదర్శి అందుబాటులో లేక పోవడంతో శాసన మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్య నారాయణ ఆగ్రహం వ్యక్తం చేయడంతో చివరి నిమిషంలో నామినేషన్ స్వీకరించారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సంప్రదాయాలకు విరుద్ధంగా పీఏసీకి ఎన్నిక నిర్వహించాల్సి రావడంతో సర్వత్రా చర్చప్రారంభమైంది.


**జనసేనకు అవకాశం**


శాసనసభలో 18 సభ్యులుకంటే తక్కువ సభ్యులు కలిగి ఉన్నందున వైకాపాకు ప్రతిపక్ష హోదా దక్కలేదు. దీంతో పీఏసీ ప్రతిపక్ష పార్టీకి ఇవ్వాలన్న సంప్రదాయంకు కూటమి ప్రభుత్వం మంగళం పాడిందని వైకాపా ఆరోపణలకు దిగింది. దీంతో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా 21 మంది సభ్యులు కలిగిన జనసేనకు పీఏసీ చైర్మన్ పదవి వరించింది. దీంతో భీమవరం ఎమ్మెల్యే పులిపర్తికి జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అవకాశం ఇచ్చారు. దీనిపై పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంప్రదాయాలు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం వల్ల ఎన్నికను తాము బహిష్కరించాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. 1965 నుంచి కూడా ప్రతిపక్షానికే పీఏసీ చైర్మన్ పదవి ఇస్తున్నారని పెద్దిరెడ్డి తెలిపారు. పార్లమెంట్ కూడా ప్రతిపక్షానికి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలని చట్టం చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్ష హోదా లేని బీజేపీకి పీఏసీ చైర్మన్ పదవిని పార్లమెంట్లో ఇచ్చారని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలన్నింటిలో పీఏసీ చైర్మన్ విషయంలో ప్రతిపక్షానికే ఇస్తున్నారని ఆయన అన్నారు. ఆఫ్ఘనిస్తాన్లో తాలిబన్లు వచ్చిన తర్వాత మాత్రమే ఆ సంప్రదాయాన్ని మార్చారని ఆయన అన్నారు. గతంలో కుంభకోణాల్ని బయటికి తీసింది కూడా పీఏసీనే అన్నారు. 2014లో పీఏసీ చైర్మన్‌గా ఎంపికైన దివంగత నాయకులు భూమా నాగిరెడ్డి శ్రీకాకుళం జిల్లా వత్సవలసలో ఉన్న ట్రైమెక్స్ బీచ్‌శాండ్ అక్రమ తవ్వకాలుపై నివేదిక ఇచ్చిన తర్వాత సంస్థ మూతపడింది. శాసనసభ ద్వారా ఎంపికయ్యే పీఏసీకి అనేక అధికారులు ఉండడంతో క్యాబినెట్ ర్యాంకు కలిగి ఉంటుంది. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ప్రస్తుత ఆర్థిక మంది పయ్యావుల కేశవ్ పీఏసీ చైర్మన్‌గా వ్యవహారించారు.

# జగనన్నకు కృతజ్ఞతలు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలస వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చింతాడ రవికుమార్‌ను నియమంచడం పట్ల జగనన్నకు కృతజ్ఞతలు చెప్పే కార్యక్రమాన్ని స్థానిక ప్రజాసేవా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల ఆమదాలవలస నియోజకవర్గానికి సంబంధించి సీనియర్ నాయకులు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకులుగా నియమించారన్నారు. అదే విధంగా చింతాడ రవికుమార్‌ను నియోజకవర్గ సమన్వయకర్తగా, మరో సీనియర్ నాయకులు కిల్లి వెంకటసత్యన్నారయణను వైకాపా రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం హర్షణీయమన్నారు. చింతాడ రవికుమార్ మాట్లాడుతూ తనను ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినందుకు పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోర్డినేటర్ విజయసాయిరెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కి, ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజలనుంచి వ్యతిరేకత మూటగట్టుకొంటుందని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తున్న కార్యకర్తలను, సామాన్య ప్రజలను సైతం తప్పుడు కేసులతో వేధిస్తున్నారన్నారు. పార్టీ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని, ఇలాంటి దారుణ ప్రవృత్తితో పార్టీ కార్యకర్తలను ప్రజల తరపున గొంతెత్తనీయకుండా అణచివేతకు గురిచేస్తున్నారన్నారు. ఈ పరిస్థితులను పార్టీ కార్యవర్గం అంతా సమిష్టిగా ఎదుర్కొని పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల తరపున పోరాడాలన్నారు. జగనన్న అంటే అభిమానంతో పార్టీ జెండా మోసిన ఏ కార్యకర్తకు అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. అందరూ సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటూ ఆమదాలవలస నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా ముందుకు నడిపించాలని పార్టీ కార్యవర్గాన్ని, కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో 4 మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ వార్డు ఇంఛార్జిలు, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కర్ణాటక సంగీత గాయకుడు, వయొలిన్ విద్వాంసుడు, వాగ్గేయకారుడు, సినీ సంగీత దర్శకుడు, గాయకుడు. ప్రపంచ వ్యాప్తంగా 25 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చినవారు, 8 సంవత్సరాల అతి చిన్న వయసులోనే కచేరీ చేయడం ద్వారా బాల సంగీత మేధావి అనిపించుకున్న వారు, సుస్వర మహర్షి మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారి వర్ధంతి జ్ఞాపకం ! మధుర మంగళ నాదమణులకు తళుకులద్దిన స్వరజ్ఞాని మంగళంపల్లి బాలమురళీకృష్ణ. కర్ణాటక, హిందుస్థానీ సంగీత సారాలను ఒడిసిపట్టిన విద్వన్మణి ఆయన. నటుడిగా, వాగ్గేయకారుడిగా, సినీ సంగీత దర్శకుడిగా, నేపథ్య గాయకుడిగా, నూతన రాగాల సృష్టికర్తగా, వయొలిన్ విద్వాంసునిగా బహుముఖ ప్రజ్ఞ కనబరించిన గొప్ప వ్యక్తి. గాన కళానిధి స్వరజ్ఞానానికి తలవొగ్గి వివిధ విశ్వవిద్యాలయాలు 12 గౌరవ డాక్టరేట్లను ఇచ్చాయి.

బాలమురళీకృష్ణ 1930, జూలై 6న అప్పటి మద్రాసు రాష్ట్రం లోని, తూర్పు గోదావరి జిల్లా, రాజోలు తాలూకా శంకరగుప్తంలో మంగళంపల్లి పట్టాభి రామయ్య, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించాడు. అతను కుటుంబికులు వృత్తి రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. తండ్రి పట్టాభిరామయ్య స్వగ్రామం సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం. కొచ్చర్లకోట రామరాజు అతను మొదటి గురువు. తరువాత తమిళనాడులో పక్షితీర్థానికి చెందిన సుబ్రహ్మణం అయ్యర్ దగ్గర కొన్నాళ్ళు శిష్యరికం చేశాడు. ఉన్నట్టుండి అతను కనపడకుండా పోవడంతో మళ్ళీ పెద్దకల్లేపల్లికి వచ్చి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి దగ్గర చేరాడు. అతను తదనంతరం అతను శిష్యుడైన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు దగ్గర ఉన్నత స్థాయి సంగీతం నేర్చుకుని విజయవాడలో స్థిరపడ్డాడు. అతను ప్రముఖ సంగీతకారుడు, వేణువు, వయొలిన్, వీణ విద్వాంసుడు. వయొలిన్ టీచర్ గా శంకరగుప్తంలో సంగీత తరగతులు నిర్వహించేవాడు. పుట్టిన 15వ రోజునే తల్లి సూర్యకాంతం మరణించడంతో అమ్మమ్మగారి ఊరు అయిన గుడిమెళ్ళంకలో తండ్రి ఆలనాపాలనలో పెరిగాడు. చిన్నతనంలోనే అతనిలోని సంగీత ప్రతిభను గుర్తించి అతని తండ్రి పారుపల్లి రామకృష్ణయ్య పంతులు దగ్గరకి శిష్యరికానికి పంపారు. పట్టాభిరామయ్య కూడా అతను దగ్గరే సంగీతం నేర్చుకోవడం విశేషం.

**బిరుదులు:**

- సంగీత కళానిధి - గాన కౌస్తుభగాన
- కళాభూషణ - గాన గంధర్వ
- గాయక శిఖామణి - జ్ఞాన శిఖామణి
- జ్ఞాన చక్రవర్తి - గాన పద్మం
- నాథ జ్యోతి - సంగీత కళా సరస్వతి
- నాథ మహర్షి - గంధర్వ గాన సామ్రాట్
- జ్ఞాన సాగర - కాళిదాస్ సమ్మాన్ మొదలైనవి.

దేశ సమైక్యతకు కృషి చేసినందుకు గాను మహారాష్ట్ర గవర్నరు బాలమురళీకృష్ణని సన్మానించారు.

# సుస్వర మహర్షి.. మంగళంపల్లి!

**నవంబర్ 22 మంగళంపల్లి బాలమురళీకృష్ణ వర్ధంతి**

**కొత్త రాగల సృష్టికర్త.. మహతి, సుముఖం, సర్వశ్రీ, ప్రతి మధ్యమావతి, గణపతి, సిద్ధి అనే కొన్ని కొత్త రాగాలను కూడా ఆవిష్కరించారు. ఈ కొత్త రాగాలు కనిపెట్టడం వల్ల అతను కొన్ని విమర్శలకు కూడా గురయ్యారు.**

**1938 జూలైలో ఎనిమిదేళ్ళ ప్రాయంలో విజయవాడలో తన గురువు పారుపల్లి రామకృష్ణయ్య, అతను గురువు సుసర్ల దక్షిణామూర్తి పేరున ఏర్పాటు చేసిన సద్గురు ఆరాధనోత్సవాలు సందర్భంగా మొట్టమొదటి సారిగా కచేరి చేశాడు. ఇదే కార్యక్రమంలో అతని గానానికి ముగ్ధుడైన హరికథ విద్వాంసుడు ముసునూరి సత్యనారాయణ అతని పేరు మురళీకృష్ణకు ముందు బాల అని చేర్చి బాలమురళీకృష్ణ అని పిలిచారు.**

మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు 1939 నుంచీ అతను ప్రొఫెషనల్ కచేరీలు చేసారు. వారు వయోలిన్, మృదంగం, కంజీరా లాంటి వాయిద్యాలన్నీ బాగా వాయించగలరు. భక్తప్రహ్లాద సినిమాలో నారదుడిగా, సందెని సింధూరం అనే మలయాళం సినిమాలో నటించారు. పలు చిత్రాలకు అతను సంగీతాన్ని అందించారు. పద్మభూషణ్, డాక్టరేట్లను వంటి బిరుదులను పొందారు. ప్రపంచ స్థాయిలో చేవెలియర్ అఫ్ ఆర్డర్ అఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి అందుకున్నారు గొప్ప సంగీత విద్వాంసులు.

బాలమురళీకృష్ణ గారు తన వృత్తి జీవితాన్ని చాలా చిన్న వయసులో ప్రారంభించారు. వారి జీవిత కాలం చివరి వరకు ప్రపంచవ్యాప్తంగా 25,000 కచేరీలు చేశారు. సంగీతంలోని అన్ని విభాగాలలోను విస్తారమైన పాండిత్యము, మంత్రముగ్ధులను చేసే గాత్రం, కంపోసింగ్ లో ప్రత్యేక శైలి అతన్ని సంగీత సామ్రాజ్యంలో అత్యున్నత శిఖరాలకు చేర్చింది. హిందుస్తానీ సంగీతంలోని సంగీతకారులతో కలిసి పని చేశారు. జుగల్ బందీ తరహా కచేరీల రూపకల్పనకి ఆద్యుడు. ఈ తరహా కచేరీ మొట్టమొదట పండిట్ భీమ్ సేన్ జోషితో కలిసి ముంబయిలో నిర్వహించారు. పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, కిషోరీ అమోన్కర్, మొదలగు వారితో కూడా జుగల్ బందీ కచేరీలు చేసారు. ఈ కచేరీలు అతనికి దేశం మొత్తంలో ప్రజాదరణ తీసుకురావడమే కాక, సంగీతం ద్వారా దేశ సమైక్యతను పెంపొందించడానికి దోహదపడ్డాయి. బాలమురళీకృష్ణ వయోలిన్, వయోలా, వీణ, మృదంగం మెదలగు సంగీతవాయిద్యాలు వాయించడంలో ప్రావీణ్యం సంపాదించారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకొన్నారు. వారు తిరుపతి తిరుమల దేవస్థానము, శృంగేరీ పీఠాలకు ఆస్థాన విద్వాంసులుగా నియమితులయ్యారు కూడా. బాలమురళీకృష్ణ గారు అమెరికా, కెనడా, బ్రిటన్, ఇట లీ, ఫ్రాన్స్, రష్యా, శ్రీలంక, మలేశియా, సింగపూర్, అనేక ఇతర దేశాలలో కచేరీలు చేశారు. తెలుగులోనే కాక సంస్కృతం, కన్నడం, తమిళం, హిందీ, బెంగాలీ, పంజాబీ భాషలలో కూడా పాటలు పాడాడు. ఫిబ్రవరి 18 న అనకాపల్లిలో చివరిసారిగా కచేరీ చేశారు.

**కర్ణాటక సంగీతకారులలో పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ ఇలా మూడు జాతీయ పురస్కారాలూ పొందిన ఏకైక వ్యక్తి బాలమురళీకృష్ణ. మధుర, మనోజ్ఞ, మంగళ నాదాల శిరోమణి మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన 86వ యేట (22 నవంబర్ 2016) చెన్నయ్ లో కన్నుమూశారు.**

**సినిమాలలో.....**

ఇక చిత్రసీమలో ఆయన స్థానం ప్రత్యేకమైంది. 'సతీసావిత్రి' (1957) చిత్రం ద్వారా బాలమురళీకృష్ణ గాయకుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగానూ పరిచయం అయ్యారు. ఆ చిత్రానికి ఎనిమిది మంది సంగీత దర్శకులు పనిచేయడం విశేషం. సుప్రసిద్ధ నటి, గాయని ఎస్. వరలక్ష్మి ఆ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించడంతో పాటు నిర్మాతగా వ్యవహరించారు. 'భక్త ప్రహ్లాద' (1967) చిత్రంలో బాల మురళీకృష్ణ నారదుడి పాత్రను పోషించడంతో పాటు అందులో అద్భుతమైన మూడు పాటలను పాడారు. ఆయన పాడిన సినిమా గీతాలు ఆయన గంభీర స్వరంలో, గమకాల గమనంలో సినీ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశాయి. 'నీవూ నేనూ వలచితిమీ' (కర్ణ), 'సలలిత రాగ సుధారస సారం' (నర్తనశాల), 'వసంతగాలికి వలపులు రేగ' (శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు కథ), 'తిరుపతి వాసా..' (దొరికితే దొంగలు), 'ఏటిలోని కెరటాలు.. ' (ఉయ్యాల జంపాల), 'పలుకే బంగారమాయెనా అందాల రామా' (అందాల రాముడు), 'మేలుకో శ్రీరామా..' (శ్రీరామాంజ నేయ యుద్ధం), 'శ్రీరామ జయరామ సీతారామా..' (ముత్యాలముగ్గు), 'ఆడవే హంసగమనా..' (శ్రీమద్విరాట పర్వం), 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా..' (గుప్పెడు మనసు), 'పాడనా వాణి కళ్యాణిగా..' (మేఘసందేశం), 'జాతకాలు కలిసే వేళా..' (ప్రియమైన శ్రీవారు) లాంటి పాటలు ప్రేక్షకుల ప్రశంసల్ని పొందాయి. 'ఆది శంకరాచార్య', 'భగవద్గీత' (సంస్కృతం) చిత్రాలకు సంగీతం అందించారు. కన్నడ చిత్రం 'హంసగీతె'లో ఆలపించిన గీతానికి 1975లో ఉత్తమ సినీ గాయకునిగా, 'మధ్వాచార్య'కు 1986లో ఉత్తమ సంగీత దర్శకునిగా జాతీయ పురస్కారాలు అందుకున్నారు.



# పవర్ ఉంటేనే జనం! లేకుంటే మౌనం

**అధికారాంతమున చూడవలె అయ్యవారి సౌభాగ్యముల్!.. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసిన తర్వాత ఇద్దరు మాజీ ముఖ్యమంత్రుల బాడీ లాంగ్వేజ్ టీవీల్లో పరిశీలించిన తర్వాత నాకు వారిలో అధికారానికి ముందు.. అధికారం తర్వాత కొట్టొచ్చిన మార్పు కనిపించింది ! అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ నవ్వుతూ ఉండే ఒక మాజీ ముఖ్యమంత్రి ఇప్పుడు నవ్వుకు దూరమైనట్టు కనిపిస్తుంది. ఎప్పుడూ కూల్ గా ఉండే ఆయన మాటల్లో ఇప్పుడు అసహనం తొంగి చూస్తుంది. మొట్టమొదటిసారిగా తల్లో తెల్ల వెంట్రుకలు.. నెరిసిన గడ్డం కనిపించింది**

ఫేస్ రీడింగ్ చూస్తే చాలా డల్‌గా అనిపిస్తుంది. పరాజయం తాలూకు నిస్పృహ ముఖంలో బయటపడిపోతుంది. ముఖంలోనే కాదు చేతల్లో కూడా కనిపిస్తుంది. అసెంబ్లీకి వెళ్లాలనిపించకపోవడం .. ఎక్కువ సమయం ఇంటికే పరిమితం అవ్వడం.. అప్పుడప్పుడు హాల్లోకొచ్చి ప్రెస్‌మీట్లో మాట్లాడి వెళ్ళిపోవడం ఇత్యాది మార్పులు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

ఇప్పటికీ జనంలోకి వెళ్తే ఈయనకు బ్రహ్మాండమైన స్పందన వస్తుంది. అదే ఉత్సాహంతో జనంలోకి వెళ్ళి ప్రజల సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తే జననేతగా మిగిలిపోతారు. ఐదేళ్ల తర్వాత అధికారానికి మార్గం సుగమం అవుతుంది.

వైస్ వెర్సాగా ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన ఆయనలో కూడా అధికారం దక్కకముందు ఇంచుమించు ఇలాటి నిస్పృహలే కనిపించాయి. ఎప్పుడూ హుందాగా కనిపించే ఆయన ఎన్నికల ముందు ఎండిపోయి పీక్కు పోయిన వాడిలా కనిపించారు.

ఎంతటి పరిస్థితుల్లో అయినా నిబ్బరంగా ఉండే ఆయన ఆఖరికి ప్రెస్ మీట్లో ఏడ్చారంటే ఎంత ఫ్రస్టేట్ అయ్యారో తెలుస్తుంది. భార్యని ట్రోల్ చేసినందున ఏడ్చేంత సున్నిత మనస్కుడు కాదు ఆయన. (గతంలో కూడా ఇంతకంటే ఎక్కువగా ఆయన కుటుంబాన్ని ట్రోల్ చేశారు)

మళ్ళీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ముఖంలో పూర్వపు కళ వచ్చింది. అరుదుగా నవ్వే మనిషి అప్పుడప్పుడు నవ్వుతున్నారు. ఇదంతా పవర్ మహత్యం..

ఇక ఇంకో మాజీ ముఖ్యమంత్రి అయితే ఏకంగా అస్త్ర సన్యాసం చేసి ముఖమే కనిపించకుండా సుదూరంగా ఫామ్ హౌస్ లో కాలక్షేపం చేస్తున్నారు. గతంలో కేవలం ఇద్దరు ఎంపీలతో పార్లమెంట్లో తెలంగాణా వాయిస్ సమర్థవంతంగా వినిపించిన చరిత్ర ఈయనకు ఉంది.

పదవిలో ఉన్నప్పుడు ప్రగతి భవన్ లో ఈయన ప్రెస్ మీట్ల కోసం విలేకరులతో పాటు జనం కూడా ఎదురుచూసేవారు. అంతటి వాక్ చాతుర్యం ఉన్న వక్తగా ఆయనకు పేరు. అలాంటిది ఆయన ప్రెస్ మీట్లు లేవు, అసలు కనిపించడమే లేదు.

కాంగ్రెస్ వాళ్ల వాళ్లలో వాళ్ళు తన్నుకుని అధికారం కోల్పోతే నన్ను లేపండి.. అప్పుడు వస్తా జనంలోకి అన్నట్టుగా ఉంది ఆయన పరిస్థితి.

రెండు రాష్ట్రాల్లో నాయకులు ప్రతిపక్ష నాయకుని పాత్ర సమర్థవంతంగా పోషించాలనీ.. తద్వారా ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజల పక్షాన నిలబడాలనే ప్రాథమిక సూత్రాలను పెద్దగా పట్టించుకున్నట్లు లేదు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం సమర్థవంతమైన పాత్ర పోషించినప్పుడే చక్కటి పాలనను రాబట్టగలం అన్న విషయం వాళ్ళకి తెలియంది కాదు.


రాజకీయాల్లో శాశ్వత విజయాలు.. శాశ్వత పరాజయాలు ఉండవని కూడా వారికి తెలుసు. అయినా అధికారం అప్పగిస్తేనే పని చేసి చూపిస్తాం.. అనుకుంటూ ప్రతిపక్ష పాత్రను నామమాత్రంగా నిర్వహించటం ఎంత వరకు సబబు ?

ఒక్క ఐదేళ్లు అధికారం లేకపోయినంత మాత్రాన ఆర్థికంగా వారికొచ్చిన నష్టం ఏమీ లేదు. కానీ ప్రజాస్వామ్యంలో సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే అంతిమంగా నష్టపోయేది ప్రజలే!

కాబట్టి ఇకనైనా ఇరువురు నేతలు పూర్తిస్థాయిలో ప్రతిపక్ష పాత్రను పోషించడమే కాకుండా అసెంబ్లీలో కూడా తమ గళాన్ని వినిపిస్తారని ఆశిద్దాం !

పీఎస్: నాయకులు పూర్తి స్థాయిలో సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరుకుంటూ పెట్టిన పోస్టు ఇది.. ఇందులో ఏ ఒక్కరి మీద అభిమానం కానీ ద్వేషం కానీ లేవు.. (అందుకే వ్యక్తిగతంగా పేర్లు పెట్టలేదు) నా పరిశీలన అందరికీ నచ్చాలని లేదు.. ఇందులో కూడా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు.

- పరేష్ తుర్లపాటి




ఎలక్ట్రికల్ ఈఈని కలిసిన

## 1104 యూనియన్ జిల్లా నేతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ శాఖ ఈఈ యోగేశ్వరరావును పట్టణంలోని ఆయన కార్యాలయంలో జిల్లా ఏపీ 1104 యూనియన్ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలపై ఆయనకు విన్నవించారు. ఈఈ సానుకూలంగా స్పందించినట్లు యూనియన్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షులు నారాయణరావు, ప్రధాన కార్యదర్శి టీవీసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు బి.రాజేంద్ర, ఉప కార్యదర్శి డి.సుందర్రావు, కోశాధికారి ఎం. లక్ష్మీ నారాయణ, కమ్యూనికేషన్ సెక్రటరీ సిహెచ్. కృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## ఆర్ఈసీఎస్ సమస్య పరిష్కరించండి

(సత్యంన్యూస్, చీపురుపల్లి)



చీపురుపల్లిలో ఉన్న ఆర్ఈసీఎస్ (రెస్కో) సమస్యను పరిష్కరించా లని ఎమ్మెల్యే కమిడి కళావెంకటరావు కోరారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించారు. లాభాల్లో నడుస్తున్న ఆర్ఈసీఎస్‌ను ఏపీఈపీడీసీఎల్‌లో కలిపినప్పటికీ నేటికీ కూడా ఆర్ఈసీఎస్‌గానే కొనసాగుతోందన్నారు. ఏపీ రెగ్యులేటరీ కమిషన్‌లో చీపురుపల్లి ఆర్ఈసీఎస్‌కు సంబంధించి సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. ఎన్డీయే మహా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సమ స్యను పరిష్కరించాలని సంబంధిత శాఖ మంత్రిని కళా వెంకటరావు కోరారు. ఈ అంశంపై స్పందించిన సంబంధిత శాఖ మంత్రి సాధ్యాసాధ్యాలను పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కరించే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు కళా వెంకటరావు ఈ సందర్భంగా తెలిపారు. దీనికి గానూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు అవకాశం ఇచ్చిన స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.




# 30 నిమిషాల్లో ఢిల్లీ-అమెరికా!

## ధ్వని కంటే వేగంగా ప్రయాణించండి!

**ఎలాన్ మస్క్ యుఎఫ్ఓ ప్లేన్: ధ్వని వేగం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనది. అయితే, మానవులు త్వరలో ధ్వని వేగంతో ప్రయాణించగలుగుతారు. ఇది ఏ కల్పిత సినిమాలోని సన్నివేశం కాదు. ఈ ఆలోచన నిజం కాబోతోంది. ఎలోన్ మస్క్ ఎప్పుడూ ఏదో ఒక పిచ్చి చేస్తూ ఉంటాడు. ఇప్పుడు ఎలోన్ మస్క్ సౌండ్ కంటే వేగంగా ప్రయాణించే యుఎఫ్ఓ ప్లేన్‌ని లాంచ్ చేయబోతున్నాడు. ఈ యుఎఫ్ఓ ప్లేన్ ద్వారా 15 గంటల ప్రయాణం కేవలం 30 నిమిషాల్లో పూర్తవుతుంది. అంటే కేవలం 30 నిమిషాల్లో ఢిల్లీ నుంచి అమెరికా చేరుకోవచ్చు.**

యునిలాడ్ టెక్ నివేదిక ప్రకారం, ఎలోన్ మస్క్ యుఎఫ్ఓ ప్లేన్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యుఎఫ్ఓ ప్లేన్ అనేది స్టార్‌షిప్ కింద నిర్మించిన ఒక రకమైన అంతరిక్ష నౌక. దీంతో దీని గుండా ప్రయాణం సాధారణ విమాన ప్రయాణంలా ఉండదు. ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్ పొలారిస్ డాన్ మిషన్‌ను ప్రారంభించింది. ఈ మిషన్ కింద నేరుగా అంతరిక్షంలో నడిచే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌తో, ఎలోన్ మస్క్ యుఎఫ్ఓ ప్లేన్‌ను ప్రారంభించబోతున్నాడు. కొన్ని గంటలపాటు ప్రయాణించే విమానం కొన్ని నిమిషాల్లో పూర్తవుతుంది. ఎలోన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేసిన 395 అడుగుల అంతరిక్ష నౌకను నిర్మించింది. వాస్తవానికి, ఉక్కుతో తయారు చేయబడినందున, ఇది చాలా తేలికగా ఉంటుంది. దీనివల్ల విమాన ప్రయాణం వేగవంతం అవుతుంది.

లాస్ ఏంజిల్స్ నుంచి టొరంటో వరకు 4,061 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 24 నిమిషాల్లో పూర్తి చేయనున్నారు. ఈ దూరాన్ని విమానంలో చేరుకోవడానికి 4.40 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. అదేవిధంగా లండన్ నుంచి న్యూయార్క్ వరకు ఉన్న 5,567 కి.మీ దూరాన్ని కేవలం 29 నిమిషాల్లోనే అధిగమించవచ్చు. ఈ దూరాన్ని విమానంలో చేరుకోవడానికి ప్రస్తుతం 8 గంటల కంటే ఎక్కువ సమయం పడుతుంది. ఢిల్లీ నుండి శాన్ ఫ్రాన్సిస్కో వరకు 12,341 కి.మీ దూరం ప్రయాణించడానికి ప్రస్తుతం విమానంలో 15.35 గంటలు పడుతుంది. అయితే, ఇప్పుడు ఈ దూరాన్ని కేవలం 30 నిమిషాల్లోనే అధిగమించవచ్చు. అలాగే, న్యూయార్క్ నుండి షాంఘైకి 11,858 కి.మీ దూరం ప్రయాణించడానికి ప్రస్తుతం 14.50 గంటల సమయం పడుతుంది. ఇప్పుడు ఈ దూరాన్ని కేవలం 39 నిమిషాల్లో అధిగమించే అవకాశం ఉంది.



# వారసుడొచ్చాడు!

కూచ్ బెహార్ ట్రోఫీలో ఢిల్లీ తరపున ఆడిన ఆర్యవీర్ సెహ్వాగ్, మేఘాలయపై అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో మెరిసిన ఆర్యవీర్ మొత్తం 229 బంతులు ఎదుర్కొని 200 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో రెండు సిక్సర్లు, ఏకంగా 34 బౌండరీలు ఉండటం విశేషం. ఫోర్లు, సిక్సుల ద్వారా మాత్రమే 148 పరుగులు సాధించిన ఆర్యవీర్ తన అటాక్ మూడ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు.ఆర్యవీర్ బ్యాటింగ్ చూసి తండ్రికి తగ్గ తనయుడు అని అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సెహ్వాగ్ తరహా దూకుడు ఆటను ఆర్యవీర్ ప్రదర్శించడంతో, అతనికి భవిష్యత్తులో టీమిండియాలో స్థానం ఖాయమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. యువ ఆటగాడి గేమ్ మేచ్యూరిటీని చూసి, అతని ప్రదర్శనల పట్ల క్రికెట్ విశ్లేషకులు కూడా ఆసక్తిగా ఉన్నారు. ఈ ఫీట్‌తో అభిమానులు ఒక్కసారిగా ఆర్యవీర్‌పై ఆశలు పెట్టుకున్నారు. తన తండ్రిలాగే టీమిండియాకు సేవలందించాలని కోరుకుంటున్నారు. కేవలం 17 ఏళ్ల వయసులోనే ఇటువంటి ప్రదర్శన కనబరచిన ఆర్యవీర్, తన కెరీర్‌లో మరిన్ని ఘనతలను సాధించడానికి సిద్ధంగా ఉన్నాడని భావిస్తున్నారు. సెహ్వాగ్ వారసుడి ప్రతిభ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మొత్తంగా, సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ తన తొలి డబుల్ సెంచరీతో క్రికెట్‌లో తన ప్రత్యేకతను చాటిచెప్పాడు. మరి తండ్రికి తగ్గ తనయుడిగా క్రికెట్ రంగంలో గుర్తింపు అందుకుంటాడో లేదో చూడాలి.

- సత్యం ఐటి డెస్క్


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

## పుష్కర కాలం.. పుష్పక విమానం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో టీడీపీ నేతలంతా ఈర్ష్యపడ్డారు. ఇకనుంచి జిల్లా ఎర్రన్న చేతుల్లోకి వెళ్లిపోతుందని భయపడ్డారు. కానీ అదే రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి పదవి దక్కినప్పుడు మాత్రం జిల్లాలో ముఖం చిట్లించిన నాయకుడు లేడు. ఎందుకంటే.. రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా కంటే ఎంపీగానే జిల్లాలో చొచ్చుకుపోతున్నారు. ఎర్రన్న ఢిల్లీ వెళ్లి తర్వాత ఆంధ్రప్రదేశ్ అంటే ఎర్రన్నాయుడు పేరే చెప్పేవారు. ఇప్పుడు సౌతిండియాకే ఆయన కొడుకు రాము బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. అతి చిన్నవయసులో కేంద్రమంత్రి అయిన సౌతిండియన్‌గా రికార్డు సృష్టించారు.

**ముక్తాయింపు:**

సరిగ్గా 12 ఏళ్ల క్రితం తన భర్త కుర్చీలో కొడుకును కూర్చోబెట్టిన కింజరాపు విజయమ్మ ఎదగాలీ పసికూన ఇంతకు ఇంతై అని దీవించలేదు. బ్రేక్‌ఫాస్ట్ ఇంటిదగ్గర చేసి, మళ్లీ రాత్రి భోజనానికే ఇంటికి రావాలని, నియోజకవర్గాల్లో తెలుగుదేశం పెద్దలెవరితోనూ గొడవలు లేకుండా అందరివాడిగా మసలుకోవాలని చెప్పి కళ్లు తుడుచుకున్నారు. ఇప్పటికీ రామ్మోహన్‌నాయుడు లంచ్ ఏదైనా నియోజకవర్గంలో, లేదూ అంటే ఇప్పుడు పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఆయన కార్యాలయం, రాజీవ్‌గాంధీ ఏవియేషన్ బిల్డింగ్‌లో.

## మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి




(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సరుబుజ్జిలి ఏఎస్ఐ సీహెచ్ చంద్రినాయుడు విద్యార్థులకు హితవు పలికారు. జిల్లా పోలీసు శాఖ పిలుపుతో 'సంకల్పం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం రొట్టవలస జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యాలు సాధించగలరని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జి.నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోనెల నియామకంపై దళిత సంఘాల హర్షం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర మాలల కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావుకు అవకాశం కల్పించడం పట్ల జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిత్యం బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి తన జీవితాన్నే దార పోసిన బోనేల అప్పారావుకు రాష్ట్ర మాలల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నామినేట్ చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లడుతూ ఆమదాలవలస ప్రాంతం కోర్లకోట గ్రామానికి చెందిన అప్పారావు ఐదు దశాబ్దాలుగా దళిత ఆదివాసీల కోసం, బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి నిత్యం పనిచేస్తూ అంబేద్కర్ భావజాలాన్ని కొనసాగించారన్నారు. భవిష్యత్తులో అప్పారావు మరిన్ని విశిష్ట పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు డి.గణేష్, బెలమర ప్రభాకర్, యడ్ల గోపీ, దండాసి జాన్, బైరి ధనరాజ్, టొంపల రమణ, రాకోటి రాంబాబు, అప్పల సూరి, బి.మురళీకృష్ణ, కానుకుర్తి గోవింద్, ముచ్చా శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు 24న ఎంపికలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డిసెంబర్ 3 నుంచి ఐదో తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి మెన్, ఉమెన్ సీనియర్ ఆర్చరీ పోటీలకు ఈ నెల 24న ఎంపికలు శ్రీకాకుళం గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తారని ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లోపింటి చిట్టిబాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీల్లో ఎంపికైనవారు సీనియర్ మెన్ & ఉమెన్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులవుతారన్నారు. ఈ పోటీలు కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్, చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ నిర్వహిస్తుందని, పోటీపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఎంట్రీ ఫీజుతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 94406 77201, 99899 78727 నెంబర్లను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

## 24న 'వేకువ' పుస్తక ఆవిష్కరణ

(సత్యంన్యూస్, రాజాం)

ఈ నెల 24న ఆదివారం శ్రీ విద్యానికేతన్ పాఠశాలలో డాక్టర్ మజ్జి భారతి రచించిన 'వేకువ' అనే కథా సంపుటి ఆవిష్కరిస్తున్నట్టు రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం తెలిపారు. తన అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గ్రంథాన్ని మజ్జి చంద్రినాయుడు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ప్రముఖ కథారచయితలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు పాల్గొంటారని అన్నారు. పుస్తక రచయిత్రి భారతి పాల్గొనే ఈ సభలో పొట్నూరు కోటిబాబు(పాలకొండ) పుస్తక పరిచయం చేస్తారని వివరించారు. సమావేశానికి కవులు, రచయితలు, భాషాభిమానులు, సాహిత్య అభిమానులు హాజరు కావాలని రంగనాథం కోరారు.

## వాలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామ, వార్డు వాలంటీర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని సిటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నరసింహమూర్తి డిమాండ్ చేసారు. గ్రామ, వార్డు వాలంటీర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, 10వేల వేతన హామీ నెరవేర్చాలని, జాబ్‌చార్ట్ ప్రకటించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు వేతనాలు పెంచకుండా పెంచుతామనే భ్రమల్లోనే చాకిరీ చేయించిందని, ఎన్నికల ముందు వైకాపా నాయకులు వాలంటీర్స్‌పై తీవ్ర ఒత్తిడి చేసి బలవంతంగా రాజీనామాలు చేయించారని, వాలంటీర్స్ ఆదాయంపైనే ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని నినాదాలు చేశారు. వాలంటీర్స్ పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉపాధి భద్రత కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో వాలంటీర్లు డి.నరసింహమూర్తి, ఎ.రాంబాబు, ఎన్.భాస్కరరావు, అప్పలమ్మ, సవర సుజాత, ఎస్.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAMES**

I Ex-Army No. 15778091A Rank NK Name Dhilleswara Rao Kona, Resident of b-83, Chowki Peta Colony, Jalantrapothangi Vill, Sompeta Mandalam, Srikakulam Dist., A.P-532264 have changed my son's names **Ramachandra Reddy** in place of **Kona Ramchandra Reddi**, and **Kona Manikantha** in place of **Kona Manikantha Reddi** vide Affidavit self declaration date:20-11-2024 before notary Tekkali Srikakulam A.P. India.

DEPONENT

## 'బొందిలి'లను ఓబీసీ జాబితాలో చేర్చాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




బొందిలి కులస్థులను ఓబీసీ జాబితాలో చేర్చాలని, బొందిలి కులస్థుల అభివృద్ధికి ఎన్‌డీయే కూటమి సహకరించాలని, ఆంధ్రప్రదేశ్‌లోని బొందిలి కులస్థులను ఓబీసీలో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోకన్వీనర్ పి.సురేష్‌బాబు సింగ్ విజ్ఞప్తి చేశారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి బొందిలి కులస్థులను బీసీ-బి జాబితాలో చేర్చారని, నాటి నుంచి నేటి వరకు దాదాపు 16 ఏళ్లుగా బొందిలి కులస్థులను ఓబీసీ చేర్చాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బొందిలి సంఘ నాయకుల ఆధ్వర్యంలో పలుమార్లు వినతి పత్రాలు అందజేస్తునే ఉన్నట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 5 లక్షలు పైగా బొందిలి కులస్తులు ఉన్నారని, ఓబీసీలో చేర్చకపోవడంతో వారి జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందని, చాలామంది యువతీ యువకులు టాలెంట్ ఉన్నప్పటికీ ఉన్నత శిఖరాలు అధిరోహించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్ర మారుతున్నా బొందిలి కులస్థుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు ఏ మాత్రం మారలేదని, ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వలు, బొందిలి కులస్థులను గుర్తించి ఓబీసీలో చేర్చి వారికి సమాజంలో సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బొందిలి కులస్తుల విన్నపానికి ప్రభుత్వాలు స్పందించి న్యాయం చేయాలని సింగ్ కోరారు.

## పార్టీ అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలి

(సత్యంన్యూస్, అమరావతి)



కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలోకి తీసుకొని వెళ్లడానికి కృషి చేయాలని, అలాగే పార్టీ అభివృద్ధికి ఆలోచనలు చేస్తూ ముందుకు వెళ్లాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు, సోంపేట మండలం జన సైనికుడు చిన్న రాజారావుకు సూచించారు. ఇటీవల విజయవాడ సచివాలయంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి నాదెండ్లను రాజారావు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రస్తుతం వారి ప్రాంతంలో పార్టీ, ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేసుకోవడానికి అన్నివిధాల ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీ నాయకులపై నేరుగా లేదా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టడం గానీ చేయకూడదని చెప్పారు. అన్ని విధాల పార్టీ తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు.



విజయవాడలోని అచ్చెన్నాయుడు ఛాంబర్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని అంధవరపు సంతోష్ తీసుకున్నారు. ఈమేరకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చేతులమీదుగా టీడీపీ సభ్యత్వకార్డును అందుకున్నారు.

- సత్యంన్యూస్, అమరావతి

## పది రోజుల బాదుడు స్కూల్స్ ఇవే..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాఠశాల విద్యాశాఖలో పైలట్ ప్రోగ్రాంగా అమలుచేస్తున్న సాయంత్రం 5 గంటల వరకు బడిగంటల వేళలు జిల్లాలో శుక్రవారం మొదలయ్యాయి. ఈమేరకు డీఈవో తిరుమల చైతన్య గురువారం రాత్రి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ పంపించారు. మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి తొమ్మిది రోజుల పాటు అమలుచేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కొన్నిచోట్ల రెండు రోజుల క్రితమే ఈ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. మెట్టక్కివలసలో మున్సిపల్ హైస్కూల్, బూర్జ, అల్లినగరం, జి.సిగడాం, కొర్ని, ముఖలింగం, ఎంఎస్ పల్లి, పాత కొజ్జిరియా, కొత్తపల్లి, కురిగాం, మెట్టవలస, ఎల్.ఎన్.పేట, మందస పీటీ, దిమిడిజోల, నరసన్నపేట బోర్డ్, లోలుగు, సీది, జేఆర్ పురం, పాత మేఘవరం, బుడితి, రొట్టవలస, టెక్కలి, అక్కుపల్లి జిల్లాపరిషత్ హైస్కూళ్లలో సాయంత్రం 5 గంటల వరకు బడి వేళలు ఉంటాయి. హిరమండలం, ఇచ్ఛాపురం, పలాస, పోలాకి, సోంపేట గవర్నమెంట్ హైస్కూల్స్, దీంతో పాటు నగరంలో ఉన్న గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, పెద్దమడిలోని ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ స్కూల్ కూడా సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి. ఇందుకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయుల ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాత ప్రభుత్వం దీనిపై ఒక అవగాహనకు రానుంది.

## నల్లబ్యాడ్జీలతో 108 ఉద్యోగుల నిరసన

(సత్యంన్యూస్, రాజాం)

రాజాం ఏరియా ఆసుపత్రి ఆవరణలో 108 ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. 108 సర్వీసులు నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. జీవో నెంబర్ 49 ద్వారా ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించాలని తెలిపారు. రోజుకి మూడు షిఫ్టుల్లో 8 గంటల పని విధానాన్ని అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు.




## లివర్ బాధిత గర్భిణీ వైద్యానికి రూ.25వేలు సాయం



(సత్యంన్యూస్, టెక్కలి)

ఆదిఆంధ్ర వీధిలో నివాసముంటున్న ఉర్జాన దుర్గాప్రసాద్ భార్య ఉర్జాన గౌతమి ఎనిమిది నెలల గర్భిణిగా ఉన్నప్పుడు రక్తహీనతతో బాధపడుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందింది. 5 యూనిట్ల బ్లడ్ ఎక్కించినప్పటికి ఒక గ్రాము బ్లడ్ కూడా పెరగకపోవడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్ నుంచి కేజీహెచ్‌కి రిఫర్ చేశారు. అక్కడ సుమారు నెల రోజులు చికిత్స పొంది మగబిడ్డను జన్మనిచ్చింది. అయితే తల్లి పరిస్థితి మాత్రం మారలేదు. రక్తహీనతకు గల కారణాలు తెలియక అక్కడి వైద్యులు తల్లిని ప్రైవేట్ హాస్పిటల్‌లో చూపిస్తే మంచిదని సలహా ఇచ్చారు. భర్త ఆటోకి వెళ్తే గాని కడుపు నింపుకోలేని పేద కుటుంబం వీరిది. ఈ విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం లివర్ బాధిత గర్భిణీకి ఆదుకోవాలనే ఆలోచనతో రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘం సెక్రటరీ లాడే కామేశ్వరరావు, ట్రెజరర్ శ్రీనివాస్ బెహరా, సంఘ సభ్యులు ఎన్.సింహాచలం, అద్దాల వీరభద్రాచారి, ధర్మవరపు పూర్ణాచారి, మున్నా, జోగి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చీరలు, దుప్పట్లు పంపిణీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి సౌజన్యంతో పట్టణంలోని పీఎన్ కాలనీ శ్రీ సత్యసాయి భజన మండలి దత్తత గ్రామమైన కొయ్యవానిపేట గ్రామంలో సుమారు 100 దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామ సేవయే రామసేవయని, పల్లె సేవయే పరమాత్ముని సేవయని సత్య సాయిబాబా అనేవారని, మరికొద్ది రోజుల్లో వైద్య శిబిరం, పశు వైద్య శిబిరం ఏర్పాటుచేసి సేవలు అందిస్తామన్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో బాలవికాస తరగతుల ద్వారా బాలబాలికల్లో నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, క్రమశిక్షణ, ఆధ్యాత్మికత అభివృద్ధి చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎల్.చంద్రశేఖర్, ఎన్.రమణమూర్తి, కె.గణపతిరావు, పి.ఆనంద్, కె.అప్పలనాయుడు, ఎన్‌విఎన్ రాజు, రాజేశ్వరరావు, గ్రామ పెద్దలు సత్యనారాయణ, కిషోర్, అప్పారావు పాల్గొన్నారు.



## పొరుగు సేవల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### - కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు పెంచాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం రాత్రి నగరంలోని కేంద్ర మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి అందించారు. తమ సమస్యలను కేంద్రమంత్రికి వివరించారు. దీనిపై రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, స్థానిక మంత్రి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు నర్సింగరావు, సీహెచ్ ఎన్‌డీ రాజేశ్వరి, గంటల సురేష్, కుమార్ రాజా, బెవర అమర్‌కుమార్, శోభ, యూనియన్ మెంబర్స్ ఉన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.